




*తెలుగు జానపద గీతాలకి, జనపద సంగీతానికి కొత్త ప్రాణం పోసిన విదుషీమణి ‘కళాప్రపూర్ణ‘ శ్రీమతి అవసరాల(వింజమూరి)అనసూయాదేవిగారి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 92 సంవత్సరాల వయసులో ఆమె వ్రాసిన వ్యాస పరంపర ఇది. అనసూయదేవిగారి సుదీర్ఘ జీవనప్రయాణంలో ఆమె కలుసుకున్న ప్రముఖ వ్యక్తులతో తన పరిచయాల గురించి ఈ శీర్షికలో వివరిస్తున్నారు.*

### ముక్త - బృంద

వీరు వీణ ధనమ్మగారి చెల్లెలి పిల్లలు. ఈ జంట క్షేత్రయ్య పదాలు పాడటంలో దిట్ట. పదాలు అనగానే వీరిపేరే ముందు చెప్పుకుంటారు. ఆ రోజుల్లో, కర్ణాటక సంగీతం పాడే గాయకులు, ముఖ్యంగా స్త్రీలు, కొంచెం తక్కువ శ్రుతిలో పాడుతూండేవారు, ఎస్.సి.వసంతకోకిలమ్, ఎమ్.ఎల్.వసంతకుమారి కొంచెం శ్రుతి పెంచారు. ముక్త, బృంద మంచి ‘హైపిచ్‘లో పాడేవారు. పదాలు పాడడంలో ఒక ప్రత్యేక స్టైల్ సృష్టించారు. 1941-42ల్లో వీరి సోదరులు విజయకృష్ణగారూ, నేనూ మద్రాసు ఆల్ ఇండియా రేడియోలో కలిసి పనిచేశాం.

ముక్త, బృంద కచేరీలెన్నింటికో నేను హాజరైనప్పటికీ, వీరితో ఎక్కువ పరిచయం మా రత్నపాప పుట్టినప్పుడు. మద్రాసు టి.నగర్‌లో, క్రెసెంట్ పార్కు స్ట్రీట్‌లో ప్రక్క ప్రక్క ఇళ్ళల్లో ఉండేవారం. మా రత్నపాప నామకరణం రోజున పాడి ఆశీర్వదించిన పెద్దలలో వీరిద్దరూ కూడా ఉన్నారు.

ప్రతీ సంవత్సరం ముక్త, బృంద ఇంట్లో దసరా నవరాత్రులలో బొమ్మల కొలువు పెట్టి, అందర్నీ పిలిచేవారు. ఓ ఏడు, నేను నా చెల్లెలు సీత బొమ్మల కొలువుకు వెళ్ళినప్పుడు, సరస్వతి మీద ఏదైనా పాట పాడమని కోరారు. నాకు చటుక్కున ఏపాటా జ్ఞప్తికి రాలేదు (కర్ణుడికి వేళకి అస్త్రాలు స్ఫురించనట్లు). ముక్త బృందగార్లకు తెలుగు రాదని భావిస్తూ, ద్వారం వెంకట స్వామి నాయుడుగారి షష్టిపూర్తికి మామయ్య కృష్ణశాస్త్రి వ్రాసిన ‘నీ ఆశీస్సుమ రాసి చల్లుమా ఓ సరస్వతీ కళాధి దేవత.. మా ద్వారముపై‘ అనే పాట పాడాను. ముక్త, బృందగార్లు తెలుగు క్షుణ్ణంగా అర్థం చేసుకోగలరని అంతవరకూ తెలియదు. ‘ఈ పాట ద్వారం వారిపై వ్రాసిన పాటనుకుంటాను‘ అన్నారు ముక్తగారు. నేను కృష్ణశాస్త్రి మేనకోడల్ని, సమయస్ఫూర్తి గల దాన్ని కనుక, చక్కగా ‘ఈ పాటకు ద్వంద్వార్థాలు తీసుకోవచ్చు. ఒకటి సరస్వతీ దేవిని ద్వారం వారిని ఆశీర్వదించమనీ, రెండోది, మా ద్వారం అనగా మా ఇల్లు, మా ఇంటిపైన కూడా నీ ఆశీస్సులు చల్లమని అర్థం‘ అంటూ సమర్థించాను.

ముక్తగారికి నా మీదెంతో అభిమానం. కర్ణాటక సంగీతనొటేషన్‌తో నేను ప్రచురించిన ‘స్త్రీలపాటలు‘ పుస్తకానికి ప్రశంసా వాక్యాలు వ్రాశారు.

## డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ

అపరత్యాగరాజు, అపూర్వ గాయకుడు, అసమాన వాగ్గేయకారుడు, నా అనుంగు సోదరుడు మా బాల మురళీకృష్ణని గురించి రాయకపోతే, ఈ నా పుస్తకం సంపూర్ణం కాదు. ఎటొచ్చీ ఈ మురళీకృష్ణని గురించి పూర్తిగా రాయాలంటే మరొక భాగవతం తయారవుతుంది. ఇతని అచీవ్‌మెంట్ పూర్తిగా రాయాలంటే నేనే మరొక పుస్తకం రాయవలసిందే. ఎంత వర్ణించగలను - ఇతని చరిత్ర. మల్లెపువ్వుకి సువాసనుంటుందని చెప్పినట్టుంది - బాలమురళి బాగా పాడతాడని చెప్పడం. అయినా ఒక అపార ప్రజ్ఞావంతుడైన గాయకుని గురించి, కొద్దో గొప్పో గాయక లోకానికి పరిచితురాలినైనా మాస్టర్స్ ఉన్నారంటే, వాళ్ళకి ఆ స్థానం కేవలం బండసాధన వల్ల లభించదని నా అనుభవం. తొంభైశాతం పైగా, ఏ కళైనా జన్మతః దైవదత్తంగా లోపల జీర్ణించి ఉంటే, దానిపైన మిగిలిన పదిశాతం సాధన వల్ల మాస్టర్స్ అవుతారు. బార్న్ గిఫ్ట్ లేనివారు ఎన్నడూ ఆర్టిస్ట్ కాలేరు. అలాంటి బార్న్ ఆర్టిస్ట్‌లో అసాధరణుడు బాలమురళీకృష్ణ, అతనిలో నాదస్వరూపమైన కళానుభూతులు నిత్యం ఉప్పొంగి, గట్లుదాటి ప్రవహిస్తుండడం వల్ల, బాలమురళీ ఇన్‌స్పైరడ్ మ్యుజిషియన్ మాత్రమే కాక, ఇన్‌స్పైర్డ్ కంపోజర్ కూడా అయ్యాడు.

బాలమురళీకృష్ణ సంగీత కుటుంబంలో సూర్యకాంతం, పట్టాభి రామయ్యగార్లకి జన్మించాడు. ఇతను ఏ స్కూలుకీ వెళ్ళి విద్యనభ్యసించలేదు. డిగ్రీలు తీసుకోలేదు. అయినప్పటికీ నిత్యమూ అతనిలో తీవ్రంగా, ప్రచండంగా ప్రజ్వలిస్తున్న కళాజ్యోతి, కాళికాదేవి కాళిదాసును మహాకవిగా మార్చినట్టు బాలమురళిని చెప్పుకోతగ్గ వాగ్గేయకారుడుగా మార్చింది. అతని సాహిత్య రచనలు కూడా సాటిలేనివే. బాలమురళి రచనల్లో అమోఘమైన, అద్వితీయమైన కళానైపుణ్యం, పదజాల ప్రౌఢిమ కూడా కనబడతాయి. అతను రచించిన ప్రతి గేయమూ ఒక కళాఖండమే. పదహారేళ్ళ బాలకుమారుడుగ ఉన్నప్పుడే, 72 మేళకర్త రాగాల్లోనూ కీర్తనలు రాసి, కొమ్ములు తిరిగిన గాయకులకు కూడా ఓ పట్టాన కొరకుడుబడని ఎన్నో కష్టమైన అజ్ఞాత రాగాల్ని పైకి లాగి, వాటిలో మాస్టర్ పీసెస్ రాసినమేధావి. ఇతను రాసిన వర్ణాలు, కీర్తనలు, జావళీలు భక్తిగీరాలు, తిల్లానాలు 400కి పైగా ఉన్నాయి. ఈ జీనియస్, కొన్ని క్రొత్తరాగాలను - లవంగి, మహతి, మనోరమ, మురళి, ఓంకార ప్రతిమధ్యమావతి, రోహిణి, సర్వశ్రీ సుముఖమ్, గణపతి, సిద్ధి, పుష్కర గోదావరి - మొదలైన వాటిని సృష్టించాడు.

నా ఎరుకలో బాలమురళి అయిదు ఇన్‌స్ట్రుమెంట్స్ వాయిస్తాడని జ్ఞాపకం. అవి వయొలిన్, వయొలా, కంజీరా, వీణ, మృదంగం. చాలా ఏళ్ళక్రితం ఓ అద్భుతమైన కచేరి జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం పాట, బాలమురళి వయొలా వాద్యాల కాంబినేషన్ ప్రోగ్రాం విన్నాను రేడియోలో. ఇతని వయొలా సోలో కచేరీలు కూడా విన్నాను.

బాలమురళీకృష్ణ నా బంధువని చెప్పుకోవడం నాకెంతో గర్వంగా ఉంటుంది. అతని పదవ ఏట నుంచి ఇప్పటి వరకు, అనగా 66 సంవత్సరాలుగా అతని గానం వింటూన్న అభిమానినీ, శ్రేయోభిలాషిని. పదేళ్ళ బాలమురళీ రూపం నాకింకా జ్ఞాపకమే. కచేరీలకు నల్లకోటు వేసుకుని దానిమీద రకరకాల మెడల్స్ తగిలించుకుని, ఓ ప్రక్క తండ్రి పట్టాభిరామయ్యగారు, మరొకప్రక్క గురువుగారు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగార్లతో సహా వస్తుండేవాడు. ఆ రోజుల్లో ఎన్నో చోట్ల, బాలమురళీ కర్ణాటక సంగీత కచేరీలూ, నా లలిత జానపద సంగీత కచేరీలూ కూడా జరిగాయని ఇటీవల అతనే జ్ఞాపకం చేశాడు.

1941 - 42లో మద్రాసు ఆల్ ఇండియా రేడియోలో, నేను మొదటి మ్యూజిక్ కంపోజర్‌గా పనిచేసే రోజుల్లో, బాలమురళిని వాళ్ళ నాన్నగారు తీసుకొచ్చారు. సోఫాలో ప్రక్కన కూర్చోపెట్టుకున్నారు. అతను కూర్చుంటేగా! సోఫా అంచు మీద ఎక్కి కూర్చోడం, వెనకాల దాక్కోవడం, స్టూడియో అంతా పరుగెత్తడం, రికార్డింగ్ జరుగుతుంటే తలుపులు తెరవడం - ఒకటేమిటి, నానా అల్లరీ చేసి,

వాళ్ళ నాన్నని ముప్పతిప్పలు పెట్టాడు. చిన్నప్పుడు అంత అల్లరి చేసేవాడు. మళ్ళా పాటపాడేటప్పుడు మాత్రం చెక్కుచెదరకుండా, అద్భుతంగా పాడేవాడు.

1961లో బాలమురళీకృష్ణ విజయవాడ మ్యూజిక్ కాలేజీలో మొదటి ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. ఎందరో ఆర్టిస్టులకు ఎన్నో విధాల సహాయపడే వ్యక్తి. ఆ రోజుల్లోనే నేను 'మహాత్మ కబీర్' కన్నడ పిక్చర్‌కి మ్యూజిక్ డైరెక్ట్ చేస్తున్నాను. నా మొదటి పిక్చర్‌లో బాలమురళి పాడి తీరాలన్నాను. విజయవాడ నుంచి మద్రాసు వచ్చి, మూడు పాటలు రికార్డు చేసి, కుచేలుడి అటుకులతో తృప్తి పడ్డ కృష్ణుడిలాగ, ఆ కంపెనీ వారిచ్చిన తక్కువ డబ్బు కూడా చూసుకోకుండా తీసుకుని నాకోసం పాడి వెళ్ళాడు. అతని ఉదారస్వభావానికి ఇదొక ఉదాహరణ.

చాలా సంవత్సరాల క్రిందట, ఓ సభలో రత్నపాప చేత బాలమురళి రాసిన కదన కుతూహలం తిల్లానా డాన్సు చేయించాను. ఆరోజన్నాడతను. 'అనసూయా! కొన్ని సంవత్సరాల తర్వాత, నేను రాసిన కీర్తనలూ, పదాలూ తిల్లానాలు కూడా త్యాగరాయ కీర్తనలాగే పాడుకుంటారు, డాన్సు చేస్తారనిపిస్తోంది', అని ఆ మాట అక్షరాలా నిజం. 'కొన్ని సంవత్సరాల తర్వాతేమిటి ఇప్పుడే చేస్తున్నారు' అన్నాను.

ఒకసారి మద్రాసులోని వాణీమహల్‌లో ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో బాలమురళీకృష్ణ కచేరీ జరిగింది. అది అసాధారణమైన చెప్పుకోదగ్గ కచేరీ. ఆ రోజు బాలమురళి అద్భుతంగా పాడాడు. రాగం తానం పల్లవికి వాణీమహల్ దద్దరిల్లిపోయింది. కల్యాణి రాగాలాపనకు శ్రోతలు తన్మయత్వంలో మునిగిపోయారు. ప్రోగ్రాం ముగిశాక, నేను ఆనందం భరించలేక అతని పాదాలకు నమస్కారం చేశాను. 'అదేమిటి నాకంటే పెద్దదానివి కాళ్ళకి నమస్కారం పెడతావు?' అన్నాడు. 'నీకు 60 ఏళ్ళు(అప్పుడు) కాని, నీ విద్యకు నూరేళ్ళు అందుకు నమస్కారం పెట్టబుద్దైంది' అన్నాను.

బాలమురళికి వచ్చినన్ని అవార్డులు, గౌరవాలు, బిరుదులు మరెవరికైనా వచ్చాయో లేదో నాకు తెలియదు. ఇతనికి మొత్తం 123 అవార్డులు వచ్చాయి. ఆ మధ్య వచ్చిన ప్రెస్టీజియస్ అవార్డు చెవలీర్ బై ఫ్రెంచ్ గవర్నమెంట్, 'దేశికోత్తమ', రవీంద్రనాథ్ ఠాగూర్ యూనివర్శిటీ, సంస్కృతికేతన్, ఇతని అవార్డుల వివరాలు ఒక చిన్న బుక్ లెట్‌గా వేయవచ్చు.

బాలమురళీకృష్ణ ఆల్ ఇండియా రేడియోలో మొదటి ప్రొడ్యూసర్‌గా పనిచేశాడు. ఇతనెన్నో నూతన ప్రక్రియలను ప్రవేశపెట్టాడు. 'భక్తిరంజని' ప్రోగ్రాం ఆరంభించిన వ్యక్తి.

ప్రసిద్ధికెక్కిన టాప్ ర్యాంకింగ్ హిందూస్థానీ సంగీత గాయకులు 'జుగల్ బందీ'గావించడమే కాకుండా, సంగీతం ద్వారా నేషనల్ ఇంటెగ్రేషన్‌కి తోడ్పడ్డాడు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల స్టేట్ మ్యూజిక్, శృంగేరి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన విద్వాన్, ఎక్స్‌పర్ట్ అడ్వైజరీ కమిటీ మ్యూజిక్ అకాడమీ, కళాక్షేత్ర ఫౌండేషన్ చెన్నై, మెంబర్ ఐసిసిఆర్ అండ్ సెంట్రల్ సంగీత నాటక అకాడమీ.

బాలమురళీ కృష్ణ పేరులో అనంతపురంలో ఒక ఆడిటోరియం నిర్మించారు. నా లలిత జానపద సంగీతాలకు ప్లాటినమ్ జూబిలీ 2004లోనే అయిపోయింది. నాకూ నా తమ్ముడికి కూడా ప్లాటినమ్ జూబిలియే కాక, సంగీత సెంటినరీ చేసుకోవాలని ఆశీర్వదిస్తున్నాను.

<u>కొచ్చమ్మాళ్</u>

నా చిన్నప్పుడు వీరి కర్ణాటక సంగీత కచేరీలు చాలా ప్రసిద్ధి. ఈమె పాలఘాట్ అయ్యర్లు. ఈమె గాత్రం బేగమ్ అఖ్తార్ గొంతులా ఉండేది. అప్పటికాలపు ఆడవాళ్ళ అరుదైన గొంతు. ఏపాట పాడినా మనస్సుకు హత్తుకుపోయేది. మనిషి కూడా చాలా అందమైనది. ఎక్కువ పొడుగు లేకపోయినా మేలిమి బంగారు ఛాయతో కొట్టొచ్చినట్లుండేది.

ఈమెతో పరిచయం కూడా చిత్రమైన సంఘటనే. వల్లూరి జగన్నాధరావుగారితో కలిసి 'అయ్యో కొయ్యోడా', మరికొన్ని జానపదగేయాలూ గ్రామఫోన్ రికార్డు ఇవ్వటానికి చెన్నపట్నం (అప్పుడు మద్రాసుని అలాగ అనేవారు) వెళ్ళాం. మొదట కొన్నాళ్ళు అడయార్ థియొసాఫికల్ సొసైటీ ఆవరణలో ఉన్న రాజమ్మగారింట్లో బసచేసి, తర్వాత కొలంబియా గ్రామ్‌ఫోన్ కంపెనీవారు ఏర్పాటు

చేసిన మౌంట్ రోడ్డులో అప్పటి వెలింగ్టన్ టాకీస్‌కి ఎదురుగా బిల్డింగ్‌లోకి మారాం. రికార్డింగ్‌కి వచ్చిన ఆర్టిస్టులందరికీ అక్కడే బస. అక్కడ కలిశాం కొచ్చమ్మాళ్ గారిని, ఆమెకు మృదంగం వాయించే దొరస్వామి, అయ్యరుగారిని. వీరేకాక, కన్నడ ఆర్టిస్టులు నాగేంద్రరావుగారు, కమలాబాయి, సుబ్బయ్యనాయుడుగారు, లక్ష్మీబాయి, తెలుగు ఆర్టిస్ట్ కపిల వాయి రామనాధ శాస్త్రిగారు, కొచ్చర్లకోట రంగారావుగారు, చిరతలు వాయించే శాస్త్రిగారిని కూడా కలిశాం.

అందరిలోకి చిన్న వయస్సు ఉన్న ఆర్టిస్టుని కనుక, అందరికీ నన్ను చూస్తే గారాబమే. కొచ్చమ్మాళ్‌ది మా ప్రక్క గదే. అస్తమానం నన్ను పిలిచి కబుర్లు చెప్పేది. కొంచెం తెలుగు మాట్లాడేది. 'ఏదీ ఆ 'అయ్యో కొయ్యోడా' అను' అని నా చేత పాడించి, తను పాడడానికి ప్రయత్నించి, 'అబ్బే! నీలాగ అనలేకుండా ఉన్నాను' అనేది నవ్వుతూ. దొరస్వామి అయ్యర్ ఎప్పుడు చూసినా పచ్చివక్క అడకత్తెరతో కత్తిరిస్తూ, పచ్చిలవంగాలు, ఏలక్కాయలతో, కుంభకోణం తమలపాకులు వేసుకుంటూ నములుతూ చిత్రంగా మాట్లాడేవారు.

నాగేంద్రరావుగారు వాళ్ళ రూంకి పిలిచి, నా చేత పాడించి, ఆయన రెండు హిందీ పాటలు 1. రాంలెలేలెకె బరియామోరి, రామ్ రామ్ మోరి 2. 'కైసే కటేగీ రసియా ఆరె సైయ్యా' నేర్పించారు. నన్ను హిందూస్థానీ సంగీతం నేర్చుకోమనీ, నా గొంతు గజల్స్‌కి బాగుంటుందనీ అనేవారు. కపిలవాయి రామనాధశాస్త్రిగారు 'నీ గొంతు నా గొంతూ మరెవరికీ లేదు మనవి స్పెషల్ గాత్రాలు' అనేవారు. నా జానపద గేయం రికార్డింగ్ చేస్తున్నపుడు చిరుతల శాస్త్రిగారు, తనూ వాయిస్తానని కోరుకుని, రికార్డింగ్ కి చిరుతలు వాయించారు.

పాటలంటే చెవి కోసుకునే నేను, కొచ్చమ్మాళ్‌గారితో కూడా కూడా తిరిగేదాన్ని. ఆవిడ మూడు తమిళపాటలు 1. నమక్కిను ఎమన్ భయమేదుం ఇల్లై నటరాజన్, ఇరుక్కుంపోదుం 2. ధీర వీర సింగార దేహ వయ్యార సేయమున్ వావా తిరుచ్చెందూర 3. హరహర భవభవ శరనం మమా, కన్నడంలో ఒక్క పురందర దాసు కీర్తన్ - 'కలియుగదల్లి హరినామవా నెనెదరు కులకోటి గళుద్దరి స్సిదవో రంగా' నేర్పించారు. ఆ రోజుల్లో కార్పొరేషన్ వారు రేడియో నడిపించేవారు, సెంట్రల్ స్టేషన్ దగ్గరున్న రిప్పన్ బిల్డింగులో. అందులో కొచ్చమ్మాళ్ లైవ్ ప్రోగ్రామ్ పాడారు. ఆ రోజు ఆమెతో నన్నూ తీసుకువెళ్ళారు. తర్వాత మా నాన్నగారు ఆమెను కాకినాడ కూడా పిలిపించి సరస్వతీ గాన సభలోనూ, మరికొన్ని ఊళ్ళలోనూ పిఠాపురం ఆస్థానంలోనూ ఆమెపాట కచేరీ ఏర్పాటు చేశారు. అన్ని ఊళ్ళకీ నేనూ వెళ్ళాను. మామయ్య స్నేహితులందరూ ఆమె పాట వింటూ పరవశించేవారు. ఆవిడ మా ఇంట్లోనే బస చేశారు. మాకు ఉత్తరాలు కూడా వ్రాసేవారు. కొన్నాళ్ళ తర్వాత ఆమె పోయిన వార్త విని ఎవరో ఆప్తులు పోయినట్టనిపించి బాధపడ్డాను.

***డి.కె.పట్టమ్మాళ్***

ఈ గాయని మహా పండితురాలు. శాస్త్రీయ సంగీతంలో, 'ప్యూరిటీ ఆఫ్ స్టైల్'ని కాపాడుతూ పాడిన వ్యక్తి. కొంతకాలం ఆమె తమ్ముడు డి.కెజయరామన్ గారు, ఆమెతో వెంట పాడుతూండేవారు. మా ఊరి సరస్వతీ గాన సభలో నేను మొదట కచేరీ విన్నప్పుడు, అక్క, తమ్ముడు కలిసి పాడారు. తర్వాత ఆమె ఒక్కరే పాడిన కచేరీలు ఎన్నో విన్నాను. జయరామన్‌గారు కూడా సోలో కచేరీలు చేసేవారు. పట్టమ్మాళ్ గారి గొప్పదనం ఏమిటంటే మనిషిలోనూ, పాటలోనూ కూడా హుందాతనం ఉంది. మంచి పటుత్వమైన పాట. మొదటి నుండి చివరి వరకూ కచేరీ నిండుగా సాగేది.

పట్టమ్మాళ్‌గారితో నామొదటి పరిచయం మద్రాసులో 'కొయ్యోడు పదం' మొదలైన పాటల మొదటి రికార్డింగ్ అయాక, రెండోసారి సోలో పాటలు, 'బుంగపాట', 'సవరాల పాత' రికార్డివ్వటానికి వెళ్ళినప్పుడు కలిశాను - పట్టమ్మాళ్‌గారినీ, జయరాంగారిని. వారిద్దరూ కూడా రికార్డు ఇవ్వటానికి వచ్చారు. నన్నెప్పుడూ పలకరించి మాట్లాడేవారు. 'నీ గాత్రం బావుంది. కర్ణాటక సంగీతం కూడా నేర్చుకో' అన్నారు, నేనప్పటికే నేర్చుకుంటున్నానని తెలియక. ఆ తర్వాత, మేము మద్రాసు మకాం మార్చాక, ఎన్నిసార్లో పట్టమ్మాళ్‌గారి కచేరీకి వెళ్ళం, వారిని కలవటం జరిగింది.

'పెళ్ళిపాటలు' పుస్తకం నేను కర్ణాటక సంగీత నొటేషన్‌తో వ్రాసి ప్రచురించినపుడు, పట్టమ్మాళ్‌గారిని ప్రశంసా వాక్యాలు వ్రాయమని కోరాను. ఆమె ఓర్పుతో, ఒక గంటసేపు నా పుస్తకంలోని పాటలను పాడించుకుని, నోట్ చేసుకుని, చక్కగా తెలుగులో వ్రాసి ఇచ్చారు. తెలుగు మాస్టర్ని పెట్టి, తెలుగు నేర్చుకున్నాననీ, త్యాగరాయ కీర్తనలు పాడటానికి భాష అర్థం చేసుకోవాలనీ అన్నారు. ఆమె వ్రాసిన ప్రశంసా వాక్యాలే నేను వ్రాసిన 5 వాల్యూమ్స్‌కీ వేసుకున్నాను.

1987లో మద్రాసు మ్యూజిక్ అకాడమీలో నేను The Interaction Between Classical and Folk Music అనే సబ్జెక్టు మీద లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్ ఇచ్చిన రోజున, పట్టమ్మాళ్ సభాధ్యక్షత వహించడమేకాక, నా పుస్తకం 'పెళ్ళిపాటలు' ఆవిష్కరించారు. 1995లో వీరినొక కచేరీలో కలిశాను. ఇద్దరు మనుషుల సహాయంతో నడుస్తున్న ఈ గొప్ప గాయనిని చూస్తే జాలేసింది. వెళ్ళి కాళ్ళకు నమస్కారం పెట్టాను. ఆ తరువాత మళ్ళీ మద్రాసు వెళ్ళినప్పుడు వారి దర్శనం చేసుకుని వచ్చాను.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Click here to share your comments on this article.